క్లుప్తంగా

పెరుగుతున్న కిన్నెరసాని నీటిమట్టం

పాల్వంచరూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయంలోకి 2వేల క్యూసెక్కుల వరద రావడంతో సోమవారం 398.70 అడుగులుగా ఉన్న నీటిమట్టం మంగళవారం 399.50 అడుగులకు పెరిగింది. కాగా, 402 అడుగులకు నీటిమట్టం చేరితే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

ఇల్లెందురూరల్: మొక్కలు నాటడాన్ని ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ మిషన్ జిల్లా సమన్వయకర్త సతీష్ ఖండేల్‌వాల్ అన్నారు. మండలంలోని సుదిమళ్ల రైతు వేదిక, మిషన్ భగీరథ డివిజన్ కార్యాలయంలో వనమహోత్సవంలో భాగంగా మంగళవారం ఆయన విరివిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతీ మొక్క ఏపుగా ఎదిగే వరకు సంరక్షించుకోవాలని సూచించారు. తద్వారా సమాజానికి ప్రాణవాయువును అందించినవారవుతారని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పాల్వంచ: కేఎల్ఆర్ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ కె.లక్ష్మారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కేఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నాయని కేఎల్ఆర్ తనయుడు, విద్యాసంస్థల డైరెక్టర్ కాటిరెడ్డి సిద్ధార్థరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహిస్తున్న శిబిరంలో పలువురు వైద్యనిపుణులు పరీక్షలు చేస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 89194 15792 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే, 12వ తేదీన కె.లక్ష్మారెడ్డి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యాసంస్థల డైరెక్టర్ మురళీప్రసాద్, ప్రిన్సిపాల్ నర్సింహారావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 10వ తేదీన మండల కేంద్రాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలగాని బ్రహ్మచారి కోరారు. బాలాజీనగర్ గ్రామపంచాయతీ ఆజాద్‌నగర్‌లోని పీఎంహెచ్ హాస్టల్‌లో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల చట్టాల స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అసంఘటిత రంగ కార్మికులకు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ నేతలు నేడు విస్మరిస్తున్నారని విమర్శించారు. హాస్టల్ వర్కర్లకు పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతులకు 'భరోసా' ఇవ్వండి

ఇల్లెందురూరల్: కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు, రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ డిమాండ్ చేశారు. రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ బోడియాతండా, జింకల తండా గ్రామాలలో మంగళవారం ఆయన కౌలు రైతుల సర్వే నిర్వహించారు. మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సాగు దారులను, కౌలుదారులను తొలగిస్తూ ధరణిలో చట్ట సవరణ చేసిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులకు సహాయం చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు బానోత్ మంగీలాల్, బాలు, ధరావత్ సక్రు, గుగులోత్ వాస్య, ధరావత్ లక్ష్మణ్, చందూలాల్ పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన విశ్వనాథం

సింగరేణి(కొత్తగూడెం): కష్టాలు, కన్నీళ్లు అనుభవిస్తూనే పేదల సమస్యల పరిష్కారానికి ఎల్.విశ్వనాథం పోరాడారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విశ్వనాథం సంతాప సభలో ఆయన మాట్లాడారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలనతో పాటు ప్రజారాజ్యం సాధనకు విశ్వనాథం జీవితాంతం పోరాడారని చెప్పారు. న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్, జె.సీతారామయ్య, యదలపల్లి సత్యం, మోకాళ్ల రమేష్, కాపు కృష్ణ, ఎండీ అలీమొద్దీన్, కె.వాసు, జి.సంజీవరావు, ఎల్.మారుతీరావు, గట్టయ్య, వీరమళ్ల సురేష్ పాల్గొన్నారు.

విరాళం

జూలూరుపాడు: కాకర్ల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ముఖ మండపం నిర్మాణానికి ఎర్రవాగు ప్రాజెక్టు చెరువు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు చీమలపాటి భిక్షం మంగళవారం శ్రీ భక్త ఆంజనేయ సేవా సమితి వారికి రూ.5,016 విరాళం అందజేశారు.

పారిశుద్ధ్యం అధ్వానం

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. పల్లెల్లో దోమలు ముసురుకుంటాయి. వీటి ప్రభావంతో క్రమంగా జ్వరాలు ఉధృతరూపం దాలుస్తాయి. ఈ సమయంలో పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడంతోపాటు దోమల నివారణకు పంచాయతీ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి. కానీ నిధుల లేమిని సాకుగా చూపుతూ అరకొర పనులతో కాలం గడుపుతూ ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- భయపెడుతున్న జ్వరాలు
- కీళ్ల నొప్పులతో ప్రజలు సతమతం
- దోమల నివారణపై కనిపించని కార్యాచరణ
- స్టోర్ రూం దాటని ఫాగింగ్ యంత్రాలు



ఎల్లాపురంలో ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన చెత్త

ఇల్లెందురూరల్: వర్షాకాలంలో వచ్చే వ్యాధులను తప్పించుకోవాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కానీ పల్లెల్లో అధికారులు ఈ విషయంలో తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. గ్రామాలలో కేవలం ఇంటింటి చెత్త సేకరణ మినహా పారిశుద్ధ్యంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. వర్షాకాలంలో చేపట్టాల్సిన స్పెషల్ శానిటేషన్ పనులను పూర్తిగా అటకెక్కించారు. కొన్ని పంచాయతీల్లో పనులు ఫర్వాలేదనిపించినా చాలాచోట్ల వీధులు చెత్తచెదారం, పిచ్చిమొక్కలు, మురుగు గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మురుగు అధికంగా ఉన్న ప్రదేశాలలో కనీసం బ్లీచింగ్ చల్లడం కూడా మరిచిపోయారు. ఇక ప్రతీ శుక్రవారం నిర్వహించే ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని వైద్య శాఖ కొనసాగిస్తూ ప్రజలకు తగు సూచనలిస్తుండగా.. పంచాయతీ అధికారులు కనీసం అందులో భాగస్వాములు కాకపోవడం పారిశుద్ధ్యం మెరుగుదలపై వారి నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతోంది.

పల్లెల్లో ఉధృతమవుతున్న జ్వరాలు...

పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో దోమల ఉధృతి అధికమైంది. దోమకాటు కారణంగా ప్రతీ పల్లెలోనూ కనీసం ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గిన వారు కీళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో ఉంటున్నారు. జ్వరం తగ్గినా పక్షం రోజులపాటు నొప్పులతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

దోమల నివారణకు చేయాల్సిన పనులు...

వర్షాకాలంలో దోమల నివారణకు గ్రామపంచాయతీలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి. దోమలకు ఆవాసాంగా ఉండే నీటి గుంతలను గుర్తించి నీటిని తొలగించాలి. వీధులలో పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలి. మురుగు ఉన్నచోట బ్లీచింగ్ చల్లించాలి. ఇళ్ల ఆవరణలో ఉండే ఖాళీ పాత్రలు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్ల వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలను చైతన్యపర్చాలి. వర్షాకాలంలో ప్రతీ గ్రామంలోనూ కనీసం వారానికోసారైన ఫాగింగ్ పనులు చేపట్టాలి.

స్టోర్ రూంల్లోనే ఫాగింగ్ యంత్రాలు...

మండలంలోని 29 గ్రామపంచాయతీలలో నాలుగేళ్ల క్రితం ఫాగింగ్ యంత్రాలను భారీ వ్యయంతో కొనుగోలు చేశారు. ఏటా వర్షాకాలంలో దోమల నివారణకు వాటి సహాయంతో ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఏటా వర్షాకాలానికి ముందే వాటి పనితీరును పరిశీలించుకోవాలి. మరమ్మతులకు గురైతే బాగు చేయించుకొని వర్షాలు కురిసిన వెంటనే ఫాగింగ్ చేసేలా సిద్ధం చేసుకోవాలి. కానీ ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా ఏ ఒక్క గ్రామపంచాయతీలోనూ కనీసం ఫాగింగ్ యంత్రాలను స్టోర్ రూం నుంచి బయటకు తీయలేదు. కొన్ని గ్రామపంచాయతీలలో కనీసం కొనుగోలు సమయంలో వచ్చిన డబ్బాలను కూడా తెరవకపోవడం విచారకరం. మరికొన్ని గ్రామపంచాయతీలలో మొరాయించి మూలకు చేరాయి.



ముత్తారపుకట్టలో స్టోర్ రూంకే పరిమితమైన ఫాగింగ్ యంత్రం

కొరవడిన పర్యవేక్షణ...

గ్రామపంచాయతీలలో మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు తరచు పర్యటిస్తుంటారు. పంచాయతీలలో తనిఖీ పేరుతో వారి చేసే పర్యటనల సమయంలో సీజనల్‌గా చేపట్టాల్సిన పనులు, అందుకు సిద్ధం చేసిన సామగ్రి, యంత్రాల వినియోగం వంటి వాటిని పరిశీలించాలి. కానీ తనిఖీ సమయంలో అధికారులు కార్యాలయ గదులకు పరిమితం కావడం, సమీపంలోని వీధులను పరిశీలించడం మినహా పరిశీలించకపోవడం వల్లే ప్రస్తుతం పంచాయతీలలో పాలన అటకెక్కిందన్న ఆరోపణలు లేకపోలేదు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి...



గ్రామాలలో ప్రస్తుతం జ్వరాల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నా.. దోమల నివారణ చర్యలు లేక జ్వరాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి.

– డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ

చర్యలు తీసుకుంటాం...



గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు మెరుగుపర్చేందుకు స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తాం. చెత్తచెదారం తొలగించడంతోపాటు అవసరమైన ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లిస్తాం. అన్ని గ్రామాలలో దోమల నివారణ కోసం ఫాగింగ్ పనులు ప్రారంభించేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు మండలం

ఏజెన్సీకి అన్యాయం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇల్లెందురూరల్: భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఏజెన్సీ గ్రామాలకు గోదావరి జలాలు తరలించకుండా పాలకులు అన్యాయం చేస్తున్నారని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ గ్రామాలకు సాగునీరు తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పోలారం, మర్రిగూడెం గ్రామపంచాయతీల పరిధిలో మంగళవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన ప్రచార సభ నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని రోళ్లపాడు చెరువు వద్ద శంకుస్థాపన చేసిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తదనంతర కాలంలో ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తూ డిజైన్‌ను మార్చారని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్నే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తూ ఏజెన్సీ ప్రజలకు అన్యాయం చేస్తోందని వాపోయారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ గ్రామాలకు నీటిని తరలించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేటాయించాలని, బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మందా నర్సింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన కోయగూడెం ఓసీలో జరిగిన పిట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడం కోసం ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కోయగూడెం ఓసీ3 బ్లాక్ వేలాన్ని రద్దు చేసి సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఏ నబీ, గుగులోత్ రాంచందర్, ఈసం నర్సింహారావు, కుంజ రమేష్, పూనెం సురేష్, జి.బాలకృష్ణ కేటీసీ కార్మికులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీకి షరతులు పెట్టొద్దు

పాల్వంచరూరల్: ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని, ధరణిని రద్దు చేసి కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, కూలీలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్‌లో డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, దాసరి రమేష్, రాపాక రమేష్, కళ్యాణ్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



వరదతో నిండిన పాల్వంచ బస్టాండ్



టేకులపల్లి: బొమ్మనపల్లి - చింతోనిచెలక మధ్య పుణ్యవాగు వద్ద వరద ఉధృతి

పాల్వంచ: చిన్నపాటి వర్షం కురిసినా పాల్వంచ బస్టాండ్ పరిసరాలు జలమయంగా మారుతున్నాయి. బస్టాండ్ ఆవరణంలోని వర్షం నీరు ఎటూ వెళ్లే మార్గం లేక మోకాళ్ల లోతు నీరు నిలబడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుగ్రామాల్లో నివాసాల్లోకి వరద నీరు చేరింది. కేశవాపురం, సీతానగర్ కాలనీ, బస్వతారక కాలనీ, జగన్నాథపురం తదితర గ్రామాల్లో వీధుల్లో వరద ప్రవహించింది. డ్రెయినేజీలు లేకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మల్లారం గ్రామంలో ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాలువలు, వాగులు పొంగి ప్రవహించాయి. బొమ్మనపల్లి – చింతోనిచెలక మధ్య రహదారిలో పుణ్యపు వాగు చప్టా మీది నుంచి కిన్నెరసాని వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీ కాలనీ, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీ నగర్, వెంకటేశ్వర హిల్స్ కాలనీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పాలిటెక్నిక్ సీసీసీ, నస్పూర్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీట్లు కావలసినవారు, గతంలో ఏదైనా కాలేజీలో వచ్చిన సీటును రద్దు చేసుకొని ఈ స్పాట్ అడ్మిషన్‌కు రావొచ్చని తెలిపారు. సింగరేణి కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ కొత్తగూడెం, రామవరం పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సమస్యలను పరిష్కరిస్తానని, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. రామవరం బస్టాండ్ సెంటర్ డ్రెయినేజీలో చెత్త నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందని, వ్యాపారస్తులు, స్థానికుల ఫిర్యాదు మేరకు చైర్‌పర్సన్ స్పందించి మంగళవారం జేసీబీ ద్వారా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని, ఇంటి ఆవరణలో చెత్తచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పైపులైన్ గుంతలు పూడ్చండి..

పాల్వంచరూరల్: పైపులైన్ నిర్మాణం కోసం తవ్విన సీసీ రోడ్లకు మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలని బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులలో గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ మంచినీటిని అందించేందుకు మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణానికి సంబంధిత కాంట్రాక్టర్ సీసీ రోడ్లను తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ గుంతలను పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే పూడ్చాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, బిజ్జం శ్రీనివాసరెడ్డి, కేసగాని శ్రీనివాస్, బత్తుల వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ నగర్, అయ్యప్పనగర్, రాజీవ్ గాంధీ మార్కెట్, కళాభవన్, రాహుల్ గాంధీనగర్, వెంగళరావు కాలనీ ప్రాంతాల్లో డీఎంఎఫ్ నిధులు రూ.4కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కూనంనేని మాట్లాడుతూ... భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. రూ.60కోట్లతో ఏపీ స్టీల్స్, పట్టినగర్ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో పాటు ప్రజలు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ నాగేశ్వరరావు, ఎస్ఐ బి.రాము, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, డి.సుధాకర్, ఎర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, కొండం వెంకన్న, మనోహర్, అన్నారపు వెంకటేశ్వర్లు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల అభివృద్ధికి ప్రతిపాదనలు...

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం, వసతుల కల్పనకు రూ.3.99 కోట్లతో ప్రతిపాదనలు సమర్పించినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు.

కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.2.25 కోట్లు, పాల్వంచ కళాశాలకు రూ.84లక్షలు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు రూ.90లక్షల నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందజేశామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర హెల్త్ సెక్రటరీకి లేఖ అందించామని తెలిపారు. ఇక కొత్తగూడెంలోని ఐదో వార్డు ప్యూన్ బస్తీకి చెందిన పవన్, రత్నాకర్ యూత్ కమిటీ ఆధ్వర్యాన, బాబు క్యాంపునకు చెందిన క్రాంతి కుమార్ నేతృత్వాన పలువురు మంగళవారం సీపీఐలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

ఇల్లెందు: జ్వరంతో బాధపడుతూ ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వారం రోజులుగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. ఆస్పత్రిలో ఇన్ పేషంట్లతో బెడ్లు నిండిపోగా, అవుట్ పేషంట్లు కూడా అదే స్థాయిలో ఉంటున్నారు. పదిహేను రోజులుగా వర్షాలు కురుస్తుండడం, పారిశుద్ధ్య లోపంతో దోమలు పెరగగా టైఫాయిడ్, తదితర జ్వరాల బారిన పలువురు పడుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం సుమారు 500 మంది వరకు అవుట్ పేషంట్లు రాగా అందులో 24 మందికి టైఫాయిడ్ ఉన్నట్లు తేలింది. ఈ సందర్భంగా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ... ప్రతీఒక్కరు ఇంట్లోనే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారాన్నే తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ విద్యారంగంపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న వీరభద్రం

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం ఆరోపించారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడు నుంచి నాలుగు మండలాలను ఒక్కో ఇన్‌చార్జ్ ఎంఈఓను కేటాయించడం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి ఆశించిన ఫలితాలు రావని తెలిపారు. ఈ మేరకు విద్యారంగ సమస్యల సాధనకు ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వీరభద్రం కోరారు. ఈ సమావేశంలో మంద నాగకృష్ణ, సీహెచ్.రాంచరణ్, మందా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల పట్ల యువతీ, యువకులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను, టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చక్కగా చదువుకోవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోయగూడెం ఓపెన్‌కాస్టు ఎల్ఎస్ఎన్ క్యాంపులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మాదక ద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



ఇల్లెందు: నోట్స్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఇల్లెందు: పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ మంగళవారం జేబీఎస్, గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 50 మందికి రూ.25 వేల విలువైన నోట్ బుక్స్, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. యెలుగూరి నగేష్ కుమార్, నరేంద్రుల అనుబాబు, కండె రమేష్, పల్లెర్ల చంద్రశేఖర్, మధుబాబు, గౌరిశెట్టి పురుషోత్తం, విజయకుమార్, మైలవరపు బసవయ్య, గందె సురేష్ పాల్గొన్నారు.

సైన్స్ స్టడీ మెటీరియల్..

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇల్లెందు పట్టణ వాస్తవ్యుడైన కొప్పుల సమ్మయ్య కుమారుడు కొప్పుల సౌమిత్ సైన్స్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ సొంత పట్టణంలో పేదలకు సహాయసహకారాలు అందించడం అభినందనీయమన్నారు.

తండాల్లో సీత్లా పండుగ సందడి

పలు తండాల్లో బంజారాలు మంగళవారం దాటుడు (సీతల) పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. మేళతాళాలతో గ్రామశివారులో కొలువుదీరిన దేవతల వద్దకు ప్రదర్శనగా చేరుకున్నారు. గోమాతలకు కీడు కలగకుండా, పంటలు బాగా పండాలని సీత్లా మాతకు పూజలు చేశారు. పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెళ్లి కాని యువతులు ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: కోడిపుంజుల వాగులో...



ఇల్లెందురూరల్: పూజలు చేస్తున్న బంజారాలు



టేకులపల్లి: మొక్కంపాడు తండాలో..